సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



వెండి మబ్బుల సోయగాలు

ఇచ్ఛాపురం రూరల్: వాయుగుండం తీరం దాటాక ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో చిన్నపాటి చిరు జల్లులు.. మరుక్షణానికే ఎండలు కనిపించాయి. సూరీడు చుట్టూ తేలియాడుతూ వెండి మబ్బులు కనువిందు చేశాయి.



భారీ ఉడుము

మెళియాపుట్టి: చాపర వీరన్నకోనేరు వద్ద భారీ ఉడుము కనిపించింది. స్థానిక యువకులు ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, విభిన్న ప్రతిభావంతుల శాఖ, జిల్లా ఉపాధి శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న జాబ్ మేళా ప్ర చార పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మంగళవారం ఆవిష్కరించారు. జాబ్ మేళాలో సు మారు 9 స్థానిక, బహుళజాతి ప్రైవేట్ సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పొలం పిలుస్తోంది పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు.

న్యూస్‌రీల్

ఉద్దానంలో పర్యావరణ పరీక్షలు

కాశీబుగ్గ: ఉద్దానంలో కిడ్నీ వ్యాధి మూలాలు కనుగొనేందుకు పలాసలో గత ప్రభుత్వం నిర్మించిన కిడ్నీ పరిశోధన కేంద్రం, పరిశోధన విభాగంలో సోమవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ది జార్జి ఇన్‌స్టిట్యూట్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న సికేడి యు క్యూర్ ప్రాజెక్టు పనులు మొదలెట్టారు. కొలంబో యూనివర్సిటీ నుంచి పర్యావరణ శాస్త్రవేత్త ప్రొఫెసర్ డాక్టర్ లెక్సా వాన్ జీన్ విచ్చేసి పలాస పరిశోధన కేంద్రంలో కార్యకలాపాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దానంలో ఇకపై పర్యావరణ పరంగా ఉన్న పరీక్షలు చేపడతామని అన్నారు. అందుకు 16 మంది సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని అన్నారు. అక్కడి నీటి నమూనాలు, ప్రాంతంలో గాలి, దుమ్ము దూళి, మట్టి, పెస్టిసైడ్, హెవీ మెటల్స్ వంటి పరీక్షలు చేస్తామని తెలిపారు.

అభ్యంతరాలు చెప్పండి

శ్రీకాకుళం: డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్‌లో లోపాలు, అభ్యంతరాలు ఉంటే నేరుగా కార్యాలయంలో గాని, రిజిస్టర్ పోస్టు ద్వారా, సంస్థ వెబ్‌సైట్ ద్వారా తెలియజేయాలని శ్రీకాకుళం సుడా వైస్ చైర్మన్ కార్యాలయం నుంచి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సుడా పరిధిలో జిల్లాలోని జి.సిగడాం, ఆమదాలవలస, నరసన్నపేట, పోలాకి, గార, శ్రీకాకుళం, లావేరు, పొందూరు, రణస్థలం, ఎచ్చెర్ల పది మండలాలతో పాటు శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస నగరపాలక సంస్థ ఉంటాయన్నారు. ఇందుకు సంబంధించిన డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్, డ్రాఫ్ట్ ఫర్పెక్ట్ ప్లాన్, డ్రాఫ్ట్ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ ఇప్పటికే ప్రచురించామని పేర్కొన్నారు. ఫిర్యాదులు, సూచనలు, సలహాలను స్వీకరించేందుకు ఈనెల 28వతేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి దేహశుద్ధి

పలాస: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌కు పలాస మండలం వీరభద్రాపురంలో మహిళలు దేహశుద్ధి చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పలాస మండలం తర్లాకోటకు చెందిన హుస్సేన్ అనంతగిరిలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. అతనికి మద్యం తాగే అలవాటు ఉంది. గత శనివారం వీరభద్రాపురంలో ఎవరో ఒక ఇంటికి వెళ్లి ఒక మహిళతో అసభ్యకరంగా మద్యం మత్తులో ప్రవర్తించడంతో ఆ గ్రామ మహిళలు దేహశుద్ధి చేశారని స్థానికులు చెబుతున్నారు. రెండు నెలల కిందట బెండి గేటు సమీపంలో కూడా ఇలాగే జరిగిందని స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు.



ఆమదాలవలస: వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



నరసన్నపేట: వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్



హిరమండలంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు



శ్రీకాకుళంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, తదితరులు

● రాజన్న స్మరణలో..

వై..ఎస్..ఆర్.. మూడు అక్షరాలను మంత్రాక్షరాలుగా భావించి వైఎస్సార్ సీపీ నేతలు మనసారా స్మరించుకున్నారు. సంక్షేమానికి కొత్త అర్థం చెప్పిన ఆ మహానాయకుడి ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వర్ధంతి సందర్భంగా రాజన్న ఘనతలను గుర్తు చేసుకుంటూ.. భావి తరాలకు ఆ ఫలాలన్నీ అందేలా పని చేద్దామని ప్రతినబూనారు.



కవిటి: కవిటిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



రణస్థలంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్



టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్



కాశీబుగ్గ: కిడ్నీ పరిశోధన కేంద్రం వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి అప్పలరాజు, నాయకులు

చీకటి వ్యాపారం



ఎన్‌జీఆర్‌పురం సముద్రపు ఒడ్డున ట్రాక్టర్‌కు లోడ్ చేస్తున్న సముద్రపు ఇసుక

- ● సముద్ర ఇసుక, గెడ్డ ఇసుక కలగలిపి విక్రయం
- ● గుట్టుచప్పుడు కాకుండా అర్ధరాత్రి లారీల్లో విశాఖ తరలింపు
- ● సముద్ర తీర ప్రాంతాల్లో నిత్యం ఇదే తంతు
- ● కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన మత్స్యకారులు

రణస్థలం: జిల్లాలో ఇంతవరకు ఇసుకను అక్రమంగా రవాణా చేశారు. ఇప్పుడు మరో మెట్టు పైకి ఎక్కి ఏకంగా కల్తీ ఇసుకను భవన నిర్మాణాల కోసం విక్రయించేస్తున్నారు. ఈ ప్రమాదకర పరిణామంపై తీర ప్రాంత వాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు కూడా చేశారు. ఎచ్చెర్ల, రణస్థలం మండలాల్లోని సముద్ర తీరప్రాంతమైన బుడగట్లపాలెం, బొంతలకోడూరు, కొచ్చెర్ల, ఎన్‌జీఆర్‌పురం, మెంటాడ ప్రాంతాల్లో కల్తీ ఇసుక వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది. ప్రతి రోజై చీకటి పడ్డాక సముద్రపు ఇసుక, గెడ్డ ఇసుక ట్రాక్టర్లతో తీసుకువచ్చి సమీప తోటల్లో వేస్తారు. ఆ రెండు ఇసుకలను జేసీబీతో అర్ధరాత్రి మిక్సింగ్ చేసి కుప్పలుగా పోగులు చేసి ఉంచుతారు. అర్ధరాత్రి వేళల్లో భోగాపురం, రాజపులోవ, తగరపువలస వంటి ప్రాంతాల నుంచి వచ్చిన భారీ లారీల్లోకి ఎత్తి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ కల్తీ



సమీప పొలాల్లో నిల్వ ఉంచిన కల్తీ ఇసుక

ఇసుక లారీల్లోని విశాఖపట్నంలోని పలు బహుళ అంతస్తుల నిర్మాణాలకు విక్రయిస్తుండడం విస్మయం కలిగిస్తోంది.

'సాక్షి' కథనాలతో కదలిక

ఈ కల్తీ ఇసుక విక్రయాలపై ఇటీవల 'సాక్షి'లో కథనాలు ప్రచురితం కావడంతో మొక్కుబడిగా అధికారులు రెండు లారీలను పట్టుకుని సీజ్ చేసి చేతులు దులుపుకున్నారు. ఆ మరుసటి రోజు నుంచి యథేచ్ఛగా కల్తీ ఇసుక లారీలు తరలిపోతున్నా అధికారులు మిన్నకుండిపోతున్నారు. దీంతో మత్స్యకారులు ఇటీవల తమ ప్రాంతానికి వచ్చిన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కే నేరుగా ఫిర్యాదు చేశారు. ఈ అక్రమాల వెనుక కూటమి నాయకుల ప్రమేయం ఉన్నట్లు అందరికీ తెలుసు. కానీ చర్యలు తీసుకోవడం లేదు. ఈ ఇసుకను వాడి భవనం కడితే చిన్నపాటి భూ ప్రకంపన వచ్చినా ఆ బిల్డింగ్ కూలిపోతుంది. ఇళ్ల తొందరగా బీటలు వారే ప్రమాదముంది.


చర్యలు తీసుకుంటాం



ఇటీవల కొచ్చెర్ల సమీప ప్రాంతాల్లో అక్రమంగా కల్తీ ఇసుక పోగులు చేసి విక్రయిస్తున్నారని పత్రికలో చదివి చర్యలు చేపట్టాం. మళ్లీ కలెక్టర్ దృష్టికి ఎన్‌జీఆర్‌పురం గ్రామస్తులు తీసుకువచ్చారు. ఆ ప్రాంతంలో కూడా నిఘా పెట్టి కల్తీ ఇసుక విక్రయం, రవాణా లేకుండా నిలుపుదల చేస్తాం.

– ఎస్.ప్రసాద్, రణస్థలం తహసీల్దార్

రెండు లారీలు సీజ్ చేశాం



ఇటీవల కల్తీ ఇసుక అక్రమంగా లారీల్లో తరలిస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. వెంటనే జేఆర్ పురం ఎస్‌ఐ చిరంజీవిని పంపించి రెండు లారీలు పట్టుకుని సీజ్ చేశాం.

– అవతారం, జేఆర్ పురం సీఐ

ఉద్యోగుల తొలగింపే అజెండా

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఉద్యోగాల తొలగింపునకు ఉన్నతాధికారులు రహస్య అజెండా సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏడుగురు కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వ నాయకుల సిఫార్సు ఆధారంగా ఈ తొలగింపుపై అజెండా సిద్ధం చేస్తున్నారు. ఈ అజెండాలను త్వరలో జరగనున్న పాలక మండలి సమావేశంలో పెట్టి తొలగించేలా ముందుకు సాగుతున్నారు. 2019 నుంచి 2024 మధ్య నియమితులైన వారిని తొలగించాలని కొందరు నాయకులు లేఖలు సైతం అందజేశారు. అయితే ప్రస్తుత అధికారులు మాత్రం నిమ్మ వెంకటరావు వీసీగా ఉన్న 2021 జనవరి 18 నుంచి 2024 జనవరి 18 మధ్య మూడేళ్ల నియామకాలపై మాత్రమే దృష్టి సారించారు.

ఈ ఏడాది జనవరి 1న 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. ఎనిమిది నెలలు పూర్తయినా వీరికి వేతనాలు ఇవ్వలేదు. ప్రస్తుతం అందరు ఉద్యోగులకు వేతనాలు అందజేసినా, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం జీతాలు అందజేయలేదు. మరో పక్క ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఇద్దరు ఎగ్జెంట్ ఫ్యాకల్టీ, ఇద్దరు న్యాయ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ప్లేస్‌మెంట్ అధికారి, బోర్డాఫ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ టూ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ పోస్టుల తొలగింపుపై దృష్టిపెట్టారు. నోటిఫికేషన్ ప్రకటన, ఇంటర్వ్యూలు ద్వారా నియమించిన పోస్టులు ఈ జాబితాలో మూడు ఉన్నాయి. ప్రస్తుతం అధికారులు ఎలాంటి ప్రకటన లేకుండా నియమించిన పోస్టులు ముగ్గురు డ్రైవర్లు, ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు, ఇద్దరు స్కావెంజర్లు, 22 కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్ అసోసియేట్ పోస్టులకు మాత్రం పాలక మండలి అనుమతులతో కొనసాగించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.

మామిడివలసలో 98 ఎకరాల్లో వరద

నరసన్నపేట: అధిక వర్షాలకు మామిడివలసలో 98 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వర్షం తగ్గినా వరద నీరు పై నుంచి వస్తుండటంతో పంట పొలాలు నీటిలోనే ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వీఏఏ ఝాన్సీ గ్రామంలో పర్యటించి ముంపు గురైన వరి పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం నీటిలో ఉన్న వరి దుబ్బులు కుళ్లే ప్రమాదంలో ఉన్నాయని రైతులు అంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వరి పంటకు నష్టం వస్తుందని రైతులు అంటున్నారు. ఉన్నతాధికారులు పర్యటించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కంబకాయ, నర్సింగపల్లి తంపర భూముల్లో కూడా వరి పొలాలు నీట మునిగి ఉన్నాయని రైతులు అంటున్నారు.



నీట మునిగిన వరిని చూపుతున్న రైతు

తీరానికి కొట్టుకు వచ్చిన మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్/గార:



జంగమయ్య (ఫైల్)

ఎచ్చెర్ల మండలంలో బొంతలకోడూరు పంచాయతీ పాత దిబ్బలపాలేంకు చెందిన కొమర జంగమయ్య (53) అనే మత్స్యకారుడు ఈనెల 31వ తేదీన నాగావళి నదిలో చేపల వేటకు వెళ్లాడు. నాగావళి నది జలాలు సముద్రంలో కలిసే ప్రాంతంలో వేట సాగిస్తుండగా, నది ఉద్ధృత ప్రవాహానికి కొట్టుకు పోయాడు. స్థానికులు గల్లంతైన వ్యక్తి కోసం బోట్లతో గాలించినా ప్రయోజనం లేకపోయింది. అధికారులకు కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. చివరకు గార మండలం బలరాంపురం సముద్రపు ఒట్టుకు సోమవారం మృతదేహం కొట్టుకు వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి జంగమయ్యదిగా తెలుసుకుని బంధువులకు సమాచారం ఇచ్చారు. అయితే అప్పటికే మృతదేహం పూర్తిగా పాడైంది. శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టు మార్టం నిర్వహించి, బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు. మృతుని భార్య నాగమ్మ ఫిర్యాదు ఆధారంగా గార ఎస్‌ఐ కె.కృష్ణప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. సంఘటన తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాత దిబ్బలపాలేం వెళ్లి మత్స్యకారుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి ఆర్థికంగా సహాయానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బిడిమి తీరంలో..

కాశీబుగ్గ: మందస మండలం బిడిమి గ్రామ సముద్ర తీరానికి సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చింది. స్థానికులు, మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించడంతో మందస పోలీసులు తీరానికి చేరుకున్నారు. మృతుడికి సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని, మృతదేహం గుర్తు పట్టలేని విధంగా ఉందని తెలిపారు. ఎవరికైనా అనుమానం ఉంటే మందస పోలీసు స్టేషన్‌కు చేరుకోవాలని కోరారు. మృతదేహాన్ని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మీకోసంకు 132 అర్జీలు



మీకోసం కార్యక్రమంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జెడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి 132 అర్జీలు వచ్చాయి. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వర రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహనరావు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తుఫాను తీరం దాటుతుందనే సమాచారం తప్ప, ఇక్కడ ఆ స్థాయిలో తుఫాను గానీ, వర్ష ప్రభావం కానీ లేదని, సరైన సమాచారం అందజేయక పోవడంతో చిన్నపాటి సమస్యలు ఉత్పన్నం అయ్యాయన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 41 ఫిర్యాదులు




వికలాంగుని సమస్య వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం ప్రజా సమస్య వేదికకు 41 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను విని సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని ఫోన్‌లో ఆదేశించారు.

పింఛన్ల పంపిణీలో గందరగోళం

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం దంత పంచాయతీలో గత మూడు రోజులుగా పింఛన్ల పంపిణీలో గందరగోళం నెలకొంది. స్థానిక టీడీపీ నాయకుల ఫిర్యాదుతో, కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్‌డీఏ అధికారులు దంత గ్రామంలో గత నెల 28, 29 తేదీల్లో సామాజిక పింఛన్లపై విచారణ చేపట్టారు. అయితే విచారణ చేశాక అనర్హులకు సంబంధించి ఎలాంటి జాబితా కూడా వారు విడుదల చేయలేదు. సోమవారం వరకు తమకు ఎలాంటి ఉత్తర్వు అందలేదని ఎంపీడీఓ కె.ఫణీంద్రకుమార్ చెబుతున్నారు. అయితే ఇదే పంచాయతీలో అనర్హుల పేరుతో 88 మందికి పింఛన్లు ఇవ్వలేదు. ఎంపీడీఓ ఆదేశాల మేరకు పింఛన్లు నిలిపివేశామని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. డీఆర్‌డీఏ పీడీ నుంచి అధికారికంగా జాబితా వస్తే మంగళవారం నాడు తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెబుతున్నారు. ఇలా ఎలాంటి స్పష్టత లేకుండా అధికారులు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం పింఛన్ల పంపిణీకి చివరి రోజు కావడంతో ఆ రోజైనా పింఛన్లు ఇస్తారో లేదో చూడాలి.

బంద్ నోటీసుల అందజేత



డిపో మేనేజర్ సుబ్బారావుకి బంద్ నోటీస్ అందజేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సూపర్ వైజర్లు, సేల్స్‌మ్యాన్లు, వాచ్‌మెన్లను తొలగించి వారి పొట్ట కొట్ట వద్దని ఏపీ స్టేట్ బేవరేజెస్ కార్పొరేషన్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకు వచ్చి తమను తొలగిస్తున్నందుకు నిరసనగా మద్యం షాపుల బంద్‌ను ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఎచ్చెర్లలోని బేవరేజెస్ కార్పొరేషన్ డిపో మేనేజర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుబ్బారావుకు బంద్ నోటీసును సోమవారం అందజేశారు. రాష్ట్ర యూనియన్ సూచనల మేరకు బంద్ నిర్వహిస్తున్నట్లు జిల్లా యూనియన్ అధ్యక్షులు పి.రామచంద్రరావు, ఉపాధ్యక్షులు ఎస్.భాస్కర్, జనరల్ సెక్రటరీ జి.కోటేశ్వరరావు తెలిపారు. ప్రైవేట్ మద్యం పాలసీ అమల్లోకి తీసుకు వచ్చినా ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ముంపు పొలాల్లో యాజమాన్య పద్ధతులు

జలుమూరు: వరి ముంపు పొలాల్లో యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు నష్టం నుంచి తప్పించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ దుంగ భాగ్యలక్ష్మి, డాక్టర్ పి.ఉదయ్‌బాబు అన్నారు. సోమవారం పాగోడు రైతు భరోసా కేంద్ర పరిధిలోని గ్రామాల్లో వారు పరిశీలించారు. ముంపునకు గురైన పొలాల్లో నీటిని వీలున్నంత త్వరగా బయటకు పంపాలన్నారు. అదే సమయంలో బూస్టర్ డోస్ ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. పాముపొడ తెగులు నివారణకు ప్రొపికొనజోల్ ఒక మిల్లీ లీటరు వాలిడామైసిన్ రెండు మిల్లీ లీటర్లు లేదా హెక్సా కొనజోల్ రెండు మిల్లీ లీటర్లు తగినంత నీటికి కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. అలాగే అగ్గి తెగులు ఆశించేందుకు కూడా ఈ వాతావరణం అనుకూలమని వీటి నివారణకు 0.6 గ్రాముల కాసుగామైసిన్ రెండు మిల్లీ లీటర్లకు కలిపి పిచికారీ చేయాలన్నారు.